విజయవంతంగా ముగిసిన గడప గడప

- చీమకుర్తి మండలంలో చివరిరోజు పోటెత్తిన పార్టీ శ్రేణులు, పథకాల లబ్ధిదారులు
- మండలంలో 25 వేల గడపల సందర్శన
- బూచేపల్లి కుటుంబానికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే టీజేఆర్
- ముగింపు కార్యక్రమంలో టీజేఆర్‌తో పాటు పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చీమకుర్తి మండలంలో చినరావిపాడులో శనివారంతో అట్టహాసంగా ముగిసింది. సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు విజయోత్సవానికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 2022 మే 13న నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం గ్రామంలో ఎమ్మెల్యే టీజేఆర్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాదాపు 14 నెలల పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, చీమకుర్తి మున్సిపాలిటీ, ఒంగోలు కార్పొరేషన్ పేర్నమిట్ట పరిధిలోని 6 డివిజన్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత చీమకుర్తి పట్టణంలో శుక్రవారం, చీమకుర్తి రూరల్‌లో శనివారం గడప గడపకు కార్యక్రమం ముగిసింది. చీమకుర్తి మండలంలో 25 వేల గడపలను సందర్శించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సూపర్ సక్సెస్...

ముగింపు విజయోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంత మేరకు ప్రజలకు అందాయో స్వయంగా తెలుసుకునేందుకు ఎమ్మెల్యేలు నిరంతరం ప్రజల్లో ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సూపర్ సక్సెస్ అయిందని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం అందించిన పథకాలు నూటికి నూరు శాతం ప్రజలకు చేరాయన్నారు. అలా చేరడంలో దళారుల వ్యవస్థ లేకుండా నేరుగా ప్రజల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలలోకి నగదు బదిలీ జరిగిందని గడప గడప కార్యక్రమంలో స్వయంగా తెలుసుకోగలిగామని బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రజలంతా సీఎం జగన్ పాలనా విధానాలపై సంతోషంగా ఉన్నారని, ఇవే పథకాలను నిరంతరం కావాలనుకుంటున్న ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని చెప్పారు. జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తామని సంక్షేమ పథకాల లబ్ధిదారులు స్పష్టం చేశారని తెలిపారు. తొలుత చినరావిపాడులో గడప గడపకు ముగింపు విజయోత్సవ కార్యక్రమానికి హాజరైన బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు తరలివచ్చారు. చినరావిపాడు సర్పంచ్ దాసరి రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ దాసరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. రూ.25 లక్షలతో నిర్మించిన మంచినీటి ట్యాంక్‌ను ప్రారంభించారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. చినరావిపాడు యూపీ స్కూల్లోని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. చీమకుర్తి మండలంలో గడప గడపకు విజయవంతం కావడంలో తనకు సహకరించిన బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డికి ఎమ్మెల్యే టీజేఆర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేజీబీవీలలో పనిచేసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో రోజువారీ వేతనం కింద కుక్స్, అసిస్టెంట్ కుక్స్, వాచ్ ఉమన్, స్వీపర్ పోస్టుల్లో పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి స్థానిక సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాలలో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. అభ్యర్థులు 7వ తరగతి ఉత్తీర్ణులై దరఖాస్తుతో పాటు మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్, వయసు ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, రెసిడెన్స్ సర్టిఫికెట్‌లు ఒరిజినల్‌తో పాటు ఒక సెట్ నకలు కాపీలు తీసుకుని హాజరుకావాలన్నారు. అభ్యర్థుల వయస్సు 28 నుంచి 42 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 47 సంవత్సరాల వరకు వయసు మినహాయింపు ఉందని అన్నారు. శారీరక వైకల్యం కలిగిన వారికి మాత్రం 52 ఏళ్ల వరకు మినహాయింపు ఉందన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈవోప్రకాశం.కో.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించుకోవాలని సూచించారు.

మండల కార్యాలయాల్లో కోతుల బెడద

మద్దిపాడు: స్థానిక మండల కార్యాలయాల వద్ద కోతుల బెడద ఎక్కువ కావడంతో కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు, పలు పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, పక్కనే ఉన్న ఆస్పత్రికి వచ్చే రోగులు బెంబేలెత్తిపోతున్నారు. గత వారం రోజుల్లో రెండు సార్లు మనుషులపై కోతులు దాడి చేశాయి. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, ఆస్పత్రి ఆవరణలో తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. శుక్రవారం ఆస్పత్రికి వచ్చిన రోగులపై కోతులు దాడి చేయడంతో కొందరు మహిళలు పరుగులు తీస్తూ కిందపడిపోయారు. మండల కేంద్రానికి వచ్చిన కొందరు వ్యక్తులు కర్రలతో అదిరించినా అవి లెక్కచేయకుండా పిచ్చిపట్టినట్లు ప్రవర్తించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. కోతులను పట్టించి దూర ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడు గిరిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి


గిరిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని తీర్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఒంగోలు: ఉపాధ్యాయుడు గిరిపై సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేయాలని, లేని పక్షంలో ఉపాధ్యాయులు అందరితో కలిసి ప్రత్యక్ష కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల నేతలు అన్నారు. శనివారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయ సంఘాల నేతల సమావేశంలో ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఉపాధ్యాయుడు గిరి కేవలం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనిచేసే వ్యక్తి అని, అంతే తప్ప ఆయనకు స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అధికారం లేదని అన్నారు. కేవలం డీఈవో, ఇతర అధికారుల ఆదేశాలతోనే ఆయన పీడీఎఫ్ ఉత్తర్వులను వర్డ్‌లోకి మార్చి దానిలో ఉపాధ్యాయుల పేర్లు నోట్‌చేసి పీడీఎఫ్‌లోకి మార్చడం జరిగిందన్నారు. ఇందులో అతనికి ఎటువంటి దురుద్దేశం లేదని, కేవలం ఉన్నతాధికారులు అలా చేసి తీసుకురమ్మంటే తీసుకువచ్చారని తెలిపారు. డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేసి బోధనకు మాత్రమే ఉపయోగించుకోవాలని, గిరిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని లేనిపక్షంలో ఉపాధ్యాయులను కాపాడుకునేందుకు ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతామని జిల్లా విద్యాశాఖ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు బి.రఘుబాబు, వై.వెంకట్రావు, టీఎల్ కాంతారావు, ఎస్.రవి, డి.శ్రీనివాసులు, బి.అశోక్‌కుమార్, దాసరి శ్రీను, పి.జాలరామయ్య, పులి శ్రీను, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ ఏర్పడిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. శనివారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. సెమిస్టర్-2కు చెందిన పాఠ్యపుస్తకాలను వారి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లోని విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజీపడకుండా పెద్దమొత్తంలో నిధులు కేటాయిస్తున్నారన్నారు. నాడు-నేడు, జేవీకే కిట్లు, నాణ్యమైన భోజనం, రాగిజావ, కోడిగుడ్లు, చిక్కీల వంటి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి విద్యాప్రమాణాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, డాక్టర్ బీ జవహర్, క్రిష్టిపాటి శేఖరరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రభుత్వ పాఠశాలల బలోపేతం


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి దంపతులు


ఉప్పుగుండూరులో పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రత్నభారతి, అశోక్‌బాబు దంపతులు

నాగులుప్పలపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెరుగుదల, వసతుల కల్పన జగనన్నతోనే సాధ్యమని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. జగనన్న విద్యా కానుకలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే సెమిష్టర్-2 పుస్తకాలను శనివారం ఎంపీపీ చేతుల మీదుగా మండలంలోని పోతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు చాలా వరకు భారం తగ్గించారని తెలిపారు. నాడు-నేడు పథకం ద్వారా ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను జగనన్న మార్చివేశారని చెప్పారు. తద్వారా ప్రతి విద్యార్థి ఆహ్లాదకర వాతావరణంలో విద్య పొందగలుగుతున్నాడన్నారు. పోతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇప్పటికే జిల్లాలో ఎక్కడా లేని విధంగా తమ సొంత నిధులతో భోజనశాల నిర్మించామన్నారు. పాఠశాలలోకి వచ్చే ప్రధాన దారి గురించి ఉపాధ్యాయులు వివరించగా మెయిన్ రోడ్డులో నుంచి పాఠశాలలోకి వెంటనే సీసీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల సౌకర్యార్థం త్వరలో బోరు కూడా వేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ దంపతులను ఎంఈవోలు రవి, ఈ.వి.రమణయ్య, పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీలం రేణుక సురేష్ పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో...

ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య శ్రీ స్టేట్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు, జెడ్పీటీసీ యాదాల రత్నభారతి, ఎంఈఓ రమణయ్య, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, మట్టిగుంట సర్పంచ్ పాలేరు నాగేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల రేషనలైజేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టాలని ఏపీటీజీ నాయకులు శనివారం ఏడీ సురేఖవాణిని కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలో ప్రస్తుతం 140 ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులుగా తేలిన ఉపాధ్యాయులను గుర్తించి వారికి సీనియార్టీ జాబితా తయారుచేసి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ప్రభుత్వానికి పోస్టులతో సహా విలీనం చేసిన ఆర్‌సీఎం సంస్థలు, చీరాల ఆది నారాయణపురం ప్రాథమిక పాఠశాల, హనుమంతునిపాడు మండలం ఈదరవారిపల్లి ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, మద్దిపాడు మండలం బసవన్నపాలెం ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని ఏపీటీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి కోరారు.

నగరంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక ఉత్తర్వులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలుచేసేందుకు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శనివారం ఆర్‌సీ నంబర్-28654/2016/ఎఫ్ 2 ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని 50 డివిజన్లను ఐదు శానిటరీ విభాగాలుగా విడగొట్టి ఒక్కో విభాగానికి ముగ్గురు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు. వారు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా దిశానిర్దేశం చేశారు.

ప్రతి గ్రూప్‌ను ఏ గ్రేడ్‌లోకి తీసుకురావాలి

మద్దిపాడు: వీవోఏలు ప్రతి గ్రూప్‌ను ఏ గ్రేడ్లోకి తీసుకురావాలని, మొబైల్ బుక్ కీపింగ్‌లో నమోదు చేయాలని డీపీఎం కృపారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీవోఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీవోఏలు బుక్ కీపింగ్ నమోదులో అప్రమత్తంగా ఉండాలన్నారు. డీపీఎం బ్యాంక్ లింకేజీ సుబ్బారావు, ఏరియా కో ఆర్డినేటర్ ఎం.విజయమ్మ, ఏ విజయమ్మ, స్త్రీ నిధి మేనేజర్ పద్మావతి, ఏపీఎం నరేంద్రకుమార్, ఎల్‌సీ వెంకట సుబ్బయ్య, సీసీలు మూర్తి మోహనరావు, స్వర్ణలత, మేరీ, శకుంతల వీఓఏలు పాల్గొన్నారు.

బాధిత గిరిజన యువకుడికి న్యాయం చేయాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఒంగోలు టౌన్: గిరిజన యువకుడిపై దాడి చేసి మూత్రం పోసిన రామాంజనేయ చౌదరితో పాటు మిగతా దుండగులను కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘ రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం గిరిజన సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేకూర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇలాంటి హేయమైన ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో పి.సుబ్బారావు, ఈ శ్రీనివాసరావు, ఎం.ఇసాక్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

26 లోగా కాపు నేస్తంకు దరఖాస్తులు

ఒంగోలు: కాపునేస్తం నిధులు లబ్ధిదారులకు ఆగస్టులో ప్రభుత్వం విడుదల చేస్తుందని జిల్లా బీసీ సర్వీస్ సహకార సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీలోగా నూతనంగా అర్హులైన వారి దరఖాస్తుల స్వీకరణ జరగాలన్నారు. 27, 28 తేదీల్లో 6 రకాల పరిశీలన పూర్తిచేస్తారని, 29న లబ్ధిదారుల జాబితాను గ్రామ/వార్డు సచివాలయాల్లో ఉంచుతారని, ఈనెల 30 నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. 9న తుది జాబితా ప్రచురించడం, 10 నుంచి 15వ తేదీవరకు కలెక్టర్ అనుమతితోపాటు ఈకేవైసీ పూర్తిచేస్తారని, అనంతరం ఆగస్టు నెలలోనే కాపునేస్తం లబ్ధిదారులకు రూ.15 వేలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారని తెలిపారు.

గ్రూపుల లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో ఉండాలి


వీవోఏలకు శిక్షణ ఇస్తున్న డీపీఎం కృపారావు

నాగులుప్పలపాడు: వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా గ్రామాల్లో కొనసాగుతున్న డ్వాక్రా గ్రూపుల లావాదేవీలన్నీ ఇకపై ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం ఐబీ డీపీఎం కృపారావు తెలిపారు. శనివారం నాగులుప్పలపాడులోని వెలుగు కార్యాలయంలో వీవోఏలకు లూకాస్ యాప్ శిక్షణ కార్యక్రమంలో డీపీఎం పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో కొన్ని సమస్యలు ఉండటంతో ఇకపై వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ లూకాస్ యాప్‌లో ప్రతి గ్రూపు వివరాలు, వారి రుణ వివరాలు, చెల్లింపులను తప్పకుండా ప్రతి సభ్యురాలు తెలుసుకునే విధంగా నమోదు చేయాలన్నారు. అందుకోసం ఏర్పాటు చేసిన యాప్‌పై క్షేత్రస్థాయిలో వీవోఏలు అవగాహన కలిగి ఉండి గ్రూపు సభ్యులకు సేవలు అందించాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో ఐబీ డీపీఎం సుబ్బారావు, ఏపీఎం రవికుమార్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కొత్తపట్నం: బాలలు చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలని స్టెప్ సీఈవో ఎంపీఎస్ లోకేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్‌లో బాలల సంరక్షణ, బాలల హక్కులు, దిశ చట్టంపై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్ ప్రిన్సిపాల్ చాపల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడుతూ బాలల సంరక్షణ, బాలల హక్కులు, జువైనల్ యాక్ట్, పోక్సో యాక్ట్ గురించి వివరించారు. చట్టాలపై ప్రతి విద్యార్థికి ఎంతో కొంత తెలిసి ఉండాలని చెప్పారు. చట్టాలున్నా కొంత మంది ఉపయోగించుకోవడం లేదని, విద్యతో పాటు చట్టాలను కూడా తెలుసుకోవాలని సూచించారు. చట్టాల గురించి తెలిసి ఉంటే భవిష్యత్‌లో ఎటువంటి నష్టాలు ఉండవన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై గౌతమ్, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, డీటీ టి.వెంకటేశ్వరరావు, సీడబ్ల్యూసీ నీలిమ వంశీ లత, సుఖీ ప్రసన్న పాల్గొన్నారు.